క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా సరూర్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లెక్చరర్స్ కాలనీ, ఆలిండియా రేడియో స్టేషన్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు. 11కేవీ సాయి కాలనీ, మదర్ డెయిరీ, సౌత్‌ఎండ్ పార్కు ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు. 11కేవీ మన్సూరాబాద్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

16న బీజేపీ బహిరంగ సభ

నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల



కార్యకర్తలతో మాట్లాడుతున్న అందెల శ్రీరాములు

బడంగ్‌పేట్: ఈనెల 16న బడంగ్‌పేటలోని సిరిపురం యాదయ్య క్రీడా మైదానంలో బీజేపీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ తెలిపారు. శుక్రవారం నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వస్తున్నారని అన్నారు. ప్రతి బూత్ స్థాయి నుంచి కనీసం 100 మందిని తరలించేలా కార్యచరణ రూపొందించాలని నాయకులను కోరారు.

ఉత్సవాలకు ఆహ్వానం



మంత్రికి ఆహ్వానపత్రం అందజేస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా కమిటీ సభ్యులు శుక్రవారం మంత్రి సబితారెడ్డిని ఆహ్వానించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల వెంకటేశ్, 11వ డివిజన్ కార్పొరేటర్ శివకుమార్, బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరేందర్‌గౌడ్ మంత్రికి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

నేడు ఎమ్మెల్సీ కసిరెడ్డి పర్యటన

కడ్తాల్: మండల పరిధిలోని గానుగుమార్లతండా, కానుగుబావితండా, పోచమ్మగడ్డ తండాలలో శనివారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌లు పర్యటించనున్నట్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీ పథకాలపై, గడప గడపకు ప్రచారంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పడకేసిన పారిశుద్ధ్యం



కమలానగర్ రోడ్డు నంబర్17లో పేరుకుపోయిన చెత్త

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని వనస్థలిపురం కమలానగర్‌లో పారిశుధ్య పనుల నిర్వహణ అధ్వానంగా తయారైంది. కాలనీలో రోడ్డు నెం.17లో చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాల్సిన సిబ్బంది సరిగా విధులు నిర్వహించడం లేదని, ఇప్పటికైనా సంబంధిత శానిటేషన్ అధికారులు పట్టించుకుని చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యురాలు చెరుకు జయమ్మ జూలై 7వ తేదీన మృతి చెందడంతో సహకార సంఘం తరఫున మృతుల కుటుంబానికి రూ.25వేల సాయం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో మృతురాలి కుమారుడు చెరుకు విజయ్‌కుమార్‌గౌడ్‌కు సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, అబ్దుల్లాపూర్ సర్పంచ్ చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు బొడిగె జగదీష్‌గౌడ్, మేనేజర్ ఐలేష్‌యాదవ్, కోటా వెంకట్‌రెడ్డి, చంద్రగొని గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

చెరువులో డంపింగ్

- డంపింగ్ యార్డుగా పెద్ద చెరువు, పరిసరాలు
- ట్రాక్టర్లలో శిథిలాలు, చెత్త తీసుకొచ్చి కట్టపై పారబోస్తున్న వైనం
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు



పెద్దచెరువు కట్టపై డంప్ చేసిన శిథిలాలు, చెత్త

మీర్‌పేట: ఓ వైపు మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు సుందరీకరణ పనులు జరుగుతుండగా మరో వైపు చెరువుకట్టపై చెత్త డంప్ చేస్తుండటంతో డంపింగ్ యార్డుగా మారుతోంది. భవనాల శిథిలాలతో పాటు చెత్తా చెదారం, వ్యర్థాలను కట్టపై డంప్ చేస్తుండటంతో పరిసరాలు కంపు కొడుతున్నాయని వాహనదారులు, స్థానికులు చెబుతున్నారు. సుందరీకరణలో భాగంగా చెరువు కట్టను వెడల్పు చేయగా ఉదయం వేళల్లో వాకింగ్‌కు వెళ్తున్నామని, కొన్ని రోజులు నుంచి శిథిలాలు, వ్యర్థాలు డంప్ చేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని సమీప కాలనీవాసులు తెలిపారు.

ట్రాక్టర్లలో తీసుకొచ్చి డంప్...

చెత్త, వ్యర్థాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భవన శిథిలాలను ఏకంగా ట్రాక్టర్లలో తీసుకొచ్చి మరీ కట్టతో పాటు చెరువు లోపల కూడా డంప్ చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఉదయం వేళల్లో ట్రాక్టర్ల ద్వారా డంప్ చేస్తుండటాన్ని గమనించిన స్థానికులు మూడు రోజుల క్రితం ట్రాక్టర్లను అడ్డుకోవడం జరిగింది. ప్రభుత్వం కోట్ల రూపాయాలతో చెరువును అభివృద్ధి చేస్తుండగా, శిథిలాలను చెరువులో ఎలా డంప్ చేస్తారని ప్రశ్నించి వాగ్వాదానికి దిగడంతో ట్రాక్టర్లు వెనక్కి వెళ్లిపోయాయి. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టకపోవడంతోనే ఇతర ప్రాంతాల నుంచి వాహనాల్లో తెచ్చి ఇష్టారాజ్యంగా డంప్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కార్పొరేషన్‌లోని ప్రధాన రహదారులు, బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే అధికారులు జరిమానాలు విధిస్తున్నారని.. అదే విధంగా పెద్ద చెరువు కట్టపై కూడా దృష్టి సారించి డంప్ చేయకుండా కట్టడి చేస్తే బావుంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన సదస్సులు
- ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే కఠిన చర్యలు
- 'సాక్షి'కి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సూరజ్ కుమార్ ప్రత్యేక ఇంటర్వ్యూ



మహేశ్వరం: నవంబర్ 30న జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మహేశ్వరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈవీఎం మెషీన్లు, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు సరిపడా ఉన్నాయని తెలిపారు. ఓటింగ్ శాతం పెంచేలా ఓటర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. నియోజకవర్గ సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని ఇలా ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై ఆయన సాక్షితో మాట్లాడారు. ఆయన మాటలు మీకోసం..

సాక్షి: మహేశ్వరం నియోజకవర్గంలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, పోలింగ్ స్టేషన్లు ఎన్ని ఉన్నాయి?

ఆర్డీఓ: మహేశ్వరం నియోజకవర్గంలో మొత్తం 511 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. అందులో 5,18,145 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు–2,67,102, మహిళలు–2,50,976 ట్రాన్స్‌జెండర్స్–67 మంది ఉన్నారు.

సాక్షి: ఎన్నికల్లో డబ్బులు, మద్యం సరఫరాను ఏవిధంగా అరికడతారు?

ఆర్డీఓ: ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్యపరుస్తున్నాం. నియోజకవర్గ, మండలాల సరిహద్దులు, ప్రధాన రోడ్ల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నాం.

సాక్షి: ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీల్లో ఎంత డబ్బు, మద్యం పట్టుకున్నారు?

ఆర్డీఓ: బాలాపూర్, మహేశ్వరం మండలాల్లో ఇప్పటివరకు రూ.7,57,500 నగదును పట్టుకున్నాం. ఎక్సైజ్ పోలీసుల సహకారంతో బెల్టు షాపులపైన దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

సాక్షి: ఎన్నికల ఖర్చు కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆర్డీఓ: నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని ఈసీ తెలిపింది. అభ్యర్థి నామినేషన్ వేసినప్పటి నుండి వెంట ఉన్న వాహనాలు, సభల ఖర్చులను ఎప్పటికప్పుడు విడియోగ్రఫీ ద్వారా రికార్డు చేసి ఖర్చుల వివరాలను సేకరిస్తాం.

సాక్షి: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఏవిధమైన చర్యలు చేపట్టారు?

ఆర్డీఓ: ఎన్నికల కోడ్ వచ్చిన ప్పటి నుంచి అధికారులు, పోలీసులను అప్రమత్తం చేశాం. నేతల ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, బ్యానర్లను తొలగించాం. రాజకీయ నాయకుల విగ్రహాలు, జెండా దిమ్మెలు, గోడలకు రాసిన రాతలు కనిపించకుండా రంగులు వేసి ముసుగులు వేశాం. కొత్తగా అభివృద్ధి పనులు ప్రారంభించకుండా చర్యలు చేపట్టాం. ఎవరైన ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

సాక్షి: ఎన్నికల కోడ్‌పై రాజకీయ పార్టీల వారికి అవగాహన కల్పిస్తున్నారా?

ఆర్డీఓ: ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడి అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు, మేసేజ్‌లు చేయొద్దని సూచిస్తున్నాం. ఎవరైన అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

సాక్షి: వృద్ధులు, వికలాంగులు ఓటు వేసేందుకు వెసులుబాటు ఏమైనా ఉందా?

ఆర్డీఓ: 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా అంగ వైకల్యం ఉన్న వారికి ఇంటి నుంచే ఓటు వేసేలా అవకాశం కల్పిస్తున్నాం.

సాక్షి: ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఇంకా అవకాశం ఉందా?

ఆర్డీఓ: ఓటు హక్కు నమోదుకు ఈనెల 31 వరకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

సాక్షి: నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆర్డీఓ: పోలింగ్ శాతం పెంచేందుకు కళాజాత బృందాల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గతంలో కంటే ఈసారి ఎక్కువ ఓటింగ్ నమోదయ్యేందుకు ప్రయత్నిస్తాం.

విద్యా నిలయంగా మహేశ్వరం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

- మంత్రి సబితారెడ్డి
- మీర్‌పేటలో కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశం

మీర్‌పేట: భవిష్యత్‌లో మహేశ్వరం నియోజకవర్గం మరో హైటెక్ సిటీగా అభివృద్ధి చెందుతుందని మంత్రి సబితారెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడ ఎస్‌వైఆర్ కన్వెన్షన్‌లో జరిగిన కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధుల ఆత్మీయ సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో మెడికల్ కళాశాల, మెట్రో ట్రైన్‌తో పాటు ఫాక్స్‌కాన్ వంటి సంస్థ ఏర్పాటు కానున్నాయని అన్నారు. అదే విధంగా రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, రూ.4 కోట్లతో డైట్ కళాశాల, మన ఊరు మనబడిలో భాగంగా రూ.32 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, మీర్‌పేటలో నూతన జూనియర్ కళాశాల, విద్యాలయాల్లో అదనపు తరగతి గదులు, రూ.300 కోట్లతో ముస్లిం మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలకు శంకుస్థాపనలు చేశామని, దీంతో నియోజకవర్గం విద్యాలయాలకు నిలయంగా మారిందని చెప్పారు. ముఖ్యంగా మీర్‌పేట, బడంగ్‌పేట, పరిసర మున్సిపాలిటీల్లో గొలుసుకట్టు చెరువులను రక్షించడంతో పాటు పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దామని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని.. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని మంత్రి కోరారు. సమావేశంలో మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, యువనాయకులు కౌశిక్‌రెడ్డి, మీర్‌పేట పార్టీ అధ్యక్షుడు కామేష్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదులకు క్రికెట్ పోటీలు

రంగారెడ్డి కోర్టులు: తెలంగాణ న్యాయవాదుల పరస్పర సహకార సంఘం స్థాపించి 25 ఏళ్లు కావస్తోంది. రజతోత్సవాల నేపథ్యంలో సంఘం ఆధ్వర్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని కోర్టుల న్యాయవాదులకు బీఎస్ రెడ్డి నగర్‌లోని ఏవైఆర్ స్టేడియంలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా సహకార సంఘం సంచాలకుడు బాచిరెడ్డి శాయిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం 13 జట్లు పాల్గొంటున్నాయని, ఉత్సవాల్లో భాగంగా రానున్న రోజుల్లో న్యాయవాదులకు వివిధ ఆటల పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. శనివారం జరగబోతున్న పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జంట నగరాల్లోని అన్ని కోర్టుల ప్రధాన న్యాయమూర్తులు హాజరుకానున్నట్లు శాయిరెడ్డి తెలిపారు.

జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌కు సన్మానం

తలకొండపల్లి: జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను, మెదక్‌పల్లి ఉప సర్పంచ్ నరేశ్ ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ వెంకటేశ్ ఇటీవల మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమితులై పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం వెంకటేశ్‌ను ఉప సర్పంచ్ నరేష్‌తో పాటు, ఆ గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఈశ్వర్‌గౌడ్, ఆంజనేయులు, మహేశ్, రజనీకాంత్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కమిటీల ఏర్పాటు

యాదవ మహాసభ నేత కృష్ణ యాదవ్

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలోని మండల, మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ల్లో అఖిల భారత యాదవ మహాసభకు సంబంధించిన కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మేకల కృష్ణ యాదవ్ తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తమ సంఘానికి కందుకూరు మండలంలో మాత్రమే కమిటీ ఉందన్నారు. కొంతమంది నాయకులు తాము సంఘానికి అధ్యక్షులు, కార్యదర్శులు అని ప్రచారం చేసుకోవడం జరుగుతుందన్నారు. పదవులు లేకుండా ప్రచారం చేసుకోవడం సిగుచేటున్నారు. యాదవులు ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. ఆసంఘం నాయకులు పాల్గొన్నారు.

నిధుల్లేవు.. బిల్లులు రావు

- సాదాసీదాగా మండల సమావేశం
- ఇబ్బందుల్లో సర్పంచ్‌లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

ఆమనగల్లు: గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులకు నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించడం లేదని పలువురు సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేసిన పనులకు నిధులు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాల్లో శుక్రవారం ఎంపీపీ అనిత విజయ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దోనాదుల కుమార్, సరితపంతునాయక్, నిట్టె మంగమ్మలు సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం వివిధ అంశాలపై సమీక్ష ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సమావేశం ఎలాంటి తీర్మాణాలు చేయకుండా కేవలం అరగంటలో ముగించారు. గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులను చేపట్టామని వాటికి సంబంధించి నెలలు గడుస్తున్నా తమకు మాత్రం బిల్లులు ఇవ్వడం లేదని సర్పంచులు తిప్పిరెడ్డి నర్సింహారెడ్డి, పబ్బతి శ్రీనయ్య, లక్ష్మణ్‌లు చెబుతున్నారు. గ్రామాలకు నిధులు విడుదలకాకపోవడంతో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడానికి అవకాశంలేక ప్రజల నుంచి మాటలు పడాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేయాలని సర్పంచ్‌లు కోరారు. గ్రామాలలో ఈజీఎస్ పనులు సరిగా జరగడం లేదని, ఈజీఎస్ ఏపీఓ మాధవరెడ్డి గ్రామాల్లో పర్యటించడం లేదని సర్పంచ్ పబ్బతి శ్రీనయ్య ఆరోపించారు. మంగళపల్లి నుంచి చెన్నారం రోడ్డులో కాలువపై బ్రిడ్జి మంజూరైనట్టు పత్రికలలో వచ్చిన విషయం గురించి ప్రస్తావన వచ్చింది. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు ఎన్ని మంజూరయ్యాయో చెప్పాలని సర్పంచ్ నర్సింహారెడ్డి కోరారు. మండల అభివృద్ధికి అందరు సహకరించాలని ఈ సందర్భంగా అనిత కోరారు. సమావేశంలో ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్, తహసీల్దార్ లలిత, అధికారులు సీతారాం, శంకర్‌నాయక్, తిరుపతిరెడ్డి, అరుణకుమారి, డాక్టర్ పరిక్షిత్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన పూర్యానాయక్ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సాలార్‌పూర్ గ్రామానికి చేరుకుని పూర్యానాయక్ పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్ కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

కల్వకుర్తి బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిగా శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జిగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం నియమితులయ్యారు. ఇప్పటికే కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను ప్రకటించారు.

సబితారెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



గూడూరులో సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు

మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గంలో సబితమ్మ గెలుపునకు అందరం కలిసికట్టుగా కృషిచేద్దామని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని గూడూరు, కొత్తూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు స్థానికంగా మంత్రి సబితారెడ్డి చేసిన అభివృద్ధి పనులను తెలియజేస్తూ కారు గుర్తుకు ఓటు వేసేలా ప్రజల్లోకి వెళ్లాలన్నారు. 48 రోజుల పాటు కష్టపడి బీఆర్‌ఎస్ పార్టీపై ప్రజలకు ఉన్న అభిమానాన్ని ఓట్లుగా మలచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పాండు, ఎంపీటీసీ రాములు, సీనియర్ నాయకులు దశరథ, ఆనంద్, బాబయ్య, పారిజాతం, బలరామ్, కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలం, భీమేష్, సదానంద్‌గౌడ్, శ్రీకాంత్, మహ్మద్ అలీ, హనుమతుయాదవ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలకు సర్వం సిద్ధం



హస్తినాపురంలో అమ్మకానికి సిద్ధంగా పూలు

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు నేటి (శనివారం) నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బతుకమ్మల తయారీ కోసం పూల కొనుగోలుదారులతో శుక్రవారం మలక్‌పేటజోన్ పరిధిలోని రహదారులు, చౌరస్తాలుకిటకిటలాడాయి. కాలనీలు, చౌరస్తాలు, చెరువుల వద్ద బతుకమ్మ ఆడేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇలా ఉండగా, ఒకపక్క బతుకమ్మ సంబురాలు, మరోపక్క దేవీనవరాత్రులు, ఇంకో పక్క ఎన్నికల హడావుడి మొదలు కావడంతో కాలనీల్లో సందడి వాతావరణ నెలకొంది. పూలకు గిరాకీ పెరిగింది.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వనస్థలిపురం: హిల్‌కాలనీలోని బచ్‌పన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం స్కూల్ 10వ వార్షికోత్సవ మెగా ఈవెంట్స్ నిర్వహించారు. బచ్‌పన్ స్కూల్స్ రీజినల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, వనస్థలిపురం సబ్ ఇన్‌స్పెక్టర్ ఈ.ఏడుకొండలు ముఖ్య అతిథులుగా హాజరై వార్షికోత్సవ మెగా ఈవెంట్స్‌లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు అన్ని పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటాలని, తద్వారా మనోవికాసంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ కల్పవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోవా నుంచి తెచ్చి నగరంలో అమ్మకం!

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

దిల్‌సుఖ్‌నగర్: అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న ఘటన సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం.. బాలాపూర్ మండలం మల్లాపూర్‌లోని ఒక ఇంటిపై ఎక్సైజ్ అధికారులు దాడి చేసి 131 రాయల్‌స్టాగ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని దినేష్ గొడిక్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు ఈ మద్యాన్ని గోవాలో తక్కువ ధరకు కొనుగోలు చేసి మల్లాపూర్ ప్రాంతంలో విక్రయిస్తున్నట్టు ఒప్పుకున్నాడు. అధికారులు రవీందర్‌రావు, హనుమంతరావు, జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.